క్లుప్తంగా

88 మంది పరీక్షకు హాజరు

పెదనందిపాడు: ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం స్థానిక పెద నందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పరీక్షలకు 90కి గాను 88 మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పాతూరి శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వనిత తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వీధి కుక్కల పట్టివేత



పెదకాకాని: వీధి కుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ గ్రామ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి పేర్కొన్నారు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండటంతో.. గురువారం బయటి నుంచి కూలీలను పిలిపించి పట్టించారు. మొత్తం 50 కుక్కలను పట్టుకున్నారు. వీటిని దూర ప్రాంతాల్లో వదిలేయనున్నట్లు వారు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా చూస్తున్నామని, ప్రజలు సహకరించాలని సర్పంచ్ స్వరూపరాణి కోరారు. ఈ సందర్భంగా సర్పంచును గ్రామస్తులు అభినందించారు.

నష్టపరిహారంగా రూ.లక్ష చెల్లించండి

గుంటూరు లీగల్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డు విభాగం ఫిర్యాది పి.సుకుమార్‌కు రూ.1,35,453 చెల్లించాలని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం ఆదేశించింది. గుంటూరులోని చంద్రమౌళీనగర్‌కు చెందిన సుకుమార్ ఎస్‌బీఐలో చీఫ్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డును తీసుకొని లావాదేవీలు జరుపుతున్నారు. దాన్నుంచి ఆయనకు తెలియకుండా రూ.32,453 కట్ అయ్యాయి. ఈ విషయం నెలవారీ స్టేట్‌మెంట్‌లో తెలిసిన వెంటనే ఎస్‌బీఐని సంప్రదించారు. ఓటీపీ రాకుండానే డబ్బులు కట్ అయినందున తిరిగి తన ఖాతాకు జమ చేయాలని కోరారు. నోటీసులు కూడా పంపించారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం తమకు సంబంధం లేదని సమాధానం పంపింది. దీంతో సుకుమార్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువురి వాదనలు విన్న కమిషన్ అధ్యక్షురాలు తాడికొండ సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి తీర్పు వెలువరించారు. ఫిర్యాది సుకుమార్‌కు క్రెడిట్ కార్డు నుంచి కట్ అయిన రూ.32,453తో పాటు నష్టపరిహారం కింద రూ.1లక్ష, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.3వేలు ఆర్నెలల్లో చెల్లించాలని ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం వారిని ఆదేశించారు. ఫిర్యాదు తరఫున న్యాయవాది డి.రవీంద్రబాబు వాదించారు.

రాష్ట్ర యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా అశోక్

పాత గుంటూరు: రాష్ట్ర యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా గాలి అశోక్ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నంలో జరిగిన కాంగ్రెస్ శిక్షణ శిబిరంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ జాతీయ చైర్మన్ రూపేష్ ఎస్. బదురియ, జాతీయ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీ కృష్ణ అల్వార్, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాకేష్ రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అశోక్ ఆనంద్ అందుకున్నారు.

ఉర్దూ బాలుర కళాశాల, హాస్టల్‌కు స్థల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నంది వెలుగు రోడ్డులో ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీ ఉర్దూ బాలుర కళాశాల, హాస్టల్‌కు సొంత భవన నిర్మాణం చేపట్టేందుకు గానూ జేసీ జి. రాజకుమారి గురువారం స్థల పరిశీలన చేశారు. సొంత భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా ఇటీవల జిల్లా అధికార యంత్రాగాన్ని కోరడంతో జేసీ రాజకుమారి, గుంటూరు ఆర్డీవో ప్రభాకరరెడ్డితో కలసి స్థల పరిశీలన చేశారు. కాగా నందివెలుగురోడ్డులో గురుకుల కళాశాల, హాస్టల్‌కు 2003లోనే స్థలాన్ని అప్పగించినట్లు ఆర్డీవో ఆమె దృష్టికి తీసుకెళ్లారు. భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు.

23న కళా దర్బార్ ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై ఈ నెల 23న వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు కళా దర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పాతూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో విద్యా రంగంలో యలవర్తి కోటీశ్వరమ్మ , వైద్య రంగంలో డాక్టర్ చింతా రామకృష్ణ, సంగీతంలో బి. జ్యోతిర్మయి, నృత్యంలో స్వాతి సోమనాథ్, సామాజిక సేవలో కె.పి. రంగారావు, కళా రంగంలో అంబటి మధుమోహన్ కృష్ణ, ఆధ్యాత్మికతలో పాతూరి నాగభూషణం, సంక్షేమ రంగంలో చాగంటి పరమేశ్వరరెడ్డికి పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా అంతర్జాతీయ నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

రోడ్డు వేసి.. మార్జిన్లు వదిలేసి

- పనులు మధ్యలో వదిలేసి పత్తాలేని కాంట్రాక్టర్
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు
- ప్రమాదాల బారిన ప్రజలు



మార్జిన్లు వేయకుండా వదిలేసిన ప్రత్తిపాడు-పాత మల్లాయపాలెం తారురోడ్డు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత.. ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. రోడ్డు వేసి.. మార్జిన్లు విస్మరించడంతో ఒకరి వెంట ఒకరు ప్రమాదాల బారిన పడి, ఆస్పత్రుల పాలవుతున్నారు. అయినా ఆర్ అండ్ బీ అధికారులకు చీమకుట్టినట్లు లేదు. పడేది మనం కాదు కదా.. ప్రాణాపాయం మనకు లేదు కదా అనుకుంటున్నారో ఏమో తెలియదు గానీ.. మూడు నెలలుగా మార్జిన్లు సంగతి మూలన పడేసి చోద్యం చూస్తున్నారు.

వివరాల్లోనికి వెళితే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ నిధులతో ప్రత్తిపాడు నుంచి పాతమల్లాయపాలెం వరకు 3.7 కిలోమీటర్ల మేర కోటిన్నర రూపాయలతో మూడు లేయర్లతో తారు రోడ్డును నిర్మించారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే సైడ్ మార్జిన్లుకు కూడా మట్టితోలి చదును చేయాల్సి ఉంది. కానీ తారు రోడ్డు నిర్మాణం పూర్తయి మూడు నెలలు దాటినప్పటికీ మార్జిన్లుకు మాత్రం నేటి వరకు గ్రావెల్ తోలకుండా అలానే వదిలేశారు. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

చెవికెక్కించుకోని అధికారులు..

రోడ్డ మార్జిన సమస్యను గ్రామస్తులు పలు మార్లు ఆర్ అండ్ బీ ఏఈ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. గ్రావెల్ దొరడం లేదని, కాంట్రాక్టర్ అందుబాటులో లేరని, మాట వినకపోతే చర్యలు తీసుకుంటామని.. ఇలా రకరకాల కారణాలు చెబుతూ కాలక్షేపం చేస్తున్నారే గానీ రోడ్డు మార్జిన్లుకు మట్టి తోలించే ప్రయత్నం మాత్రం చెయ్యడం లేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని ఆర్ అండ్ బీ ఏఈ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా గ్రావెల్ కొరత వల్ల మార్జిన్లకు మట్టితోలడం లేదని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారంలో మార్జిన్ పనులు పూర్తి చేయిస్తానని చెప్పారు. లేదంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

ప్రమాదాల బారిన..



ప్రమాదకరంగా మారిన రోడ్డు మార్జిన్లు

ఈ మార్గం నుంచి ప్రత్తిపాడు మీదుగా పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, తిమ్మాపురం, వంగిపురం, పల్లపాడు, సోపాడు.. ఇలా అనేక గ్రామాలకు ప్రజలు తమ ప్రయాణం సాగిస్తుంటారు. ఇప్పటి వరకు సుమారు పది మందికిపైగా ప్రయాణీకులు సైడ్ మార్జిన్‌ల కారణంగా కిందట పడి ప్రమాదాలకు గురయ్యారు. పల్లపాడుకు చెందిన ఒక మహిళ ద్విచక్ర వాహనం నుంచి కింద పడటంతో స్థానిక కాటూరి ఆస్పత్రిలో ఆమె వెన్నుకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది.అదేవిధంగా పాతమల్లాయపాలెం దళితవాడకు చెందిన ఒక వ్యక్తి ప్రమాదం బారిన పడి మంచానికే పరిమితమయ్యాడు. ఇలా నిత్యం ఈ మార్గంలో ప్రయాణీకులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయా సాగర్

తెలగాయపాలెం(కాకుమాను): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త సిద్దెల కోటేశ్వరరావు కుటుంబానికి గురువారం ఆ పార్టీ మంజూరు చేసిన నగదును రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయా సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటేశ్వరరావు కుటుంబానికి.. స్థానిక శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పార్టీ తరుపున రూ.5లక్షల రూపాయలను మంజూరు చేయించినట్లు తెలిపారు. నమ్ముకున్న వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ చింతల రాహేలమ్మ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, గేరా పున్నారావు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, అసదుల్లా, వీరయ్య, వీరాస్వామి, శ్రీనివాసరావు, మువ్వ చిన్న తదితరులు ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ పి.సంధ్యారాణి



శనగ సాగు చేస్తున్న రైతులకు సూచనలిస్తున్న ఏఓ కిరణ్మయి

పెదకాకాని: వాతావరణ శాఖ ఈ నెల 20 వరకు వర్ష సూచన తెలియజేసిందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై గురువారం రైతులకు ఆమె అవగాహన కల్పించారు. మండలంలోని అనుమర్లపూడి గ్రామ రైతులతో మాట్లాడారు. మినుము, పెసర, శనగ, మొక్కజొన్న పొలాల్లో నీటి తడులు పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా కల్లాల్లో మిరప ఆరబెట్టిన రైతులు వర్షపు జల్లులకు కాయలు తడవకుండా పట్టలు కప్పుకోవాలని సూచించారు. రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌లో ఏమైనా తేడా ఉంటే ఈ నెల 18వ తేదీ లోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆడిట్ తనిఖీలలో భాగంగా అన్ని ఆర్బీకేల్లో రబీ ఈ క్రాప్ బుకింగ్ చేసిన రైతుల జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. మాజీ సర్పంచి దానబోయిన పాములు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కాకుమాను: రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.కిరణ్మయి సూచించారు. మండలంలోని కాకుమాను, కొండపాటూరు గ్రామాలలో శనగ, మొక్కజొన్న, మిర్చి సాగు చేస్తున్న రైతులు..మారుతున్న వాతావరణ పరిస్థితులను గమనించి, వ్యవసాయ పనులు చేపట్టాలని ఆమె తెలిపారు. కోత పూర్తి చేసిన మిర్చి పంటను రైతులు టార్పాలిన్ పరదాలు కప్పి భద్ర పరుచుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

అనుమతిలేని లేఅవుట్లపై సీఆర్డీఏ అధికారుల కొరడా

- నాలుగు లే అవుట్లలో రోడ్లు తొలగింపు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



అనధికారి లే అవుట్‌లో బోర్డులు ఏర్పాటు చేసిన సీఆర్డీయే పంచాయతీ అధికారులు

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో అనుమతి లేని లే అవుట్లపై సీఆర్డీయే అధికారులు కొరడా ఝుళిపించారు. సర్వే నెంబర్ 308, 310, 99, 310/4 లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్న నాలుగు లే అవుట్లలో రోడ్లు, హద్దు రాళ్లు, తొలగించి అనధికారి లే అవుట్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అనధికారిక లే అవుట్లు అభివృద్ధి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తొలగించేందుకు అయిన ఖర్చులు కూడా ప్లాట్ల యజమానుల నుంచే వసూలు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. లే అవుట్లు వేసే యజమానులు సీఆర్డీయే, పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని లేకుంటే ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు, ప్లాను మంజూరు, లోన్లు మంజూరు చేయబడవు కావున కొనుగోలుదారులు గమనించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్డీయే డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ స్టాలిన్, పంచాయతీ కార్యదర్శి వి రవి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మందపాడు పీహెచ్‌సీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న మందపాడు సర్పంచ్ సంజీవరెడ్డి

మేడికొండూరు: మండలంలోని మందపాడు గ్రామ ప్రాథమిక ఆరోగ్యవైద్యకేంద్రానికి ఎన్క్వాస్ అవార్డు దక్కింది. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో జాతీయ వైద్య ఆరోగ్యబృందం మందపాడు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించింది. మౌలిక సదుపాయాలను, ఆసుపత్రి పనితీరు పరిశీలించిన బృందం నివేదికను జాతీయ ఆరోగ్య వైద్య ఆరోగ్యకేంద్రం శాఖకు అందించింది. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో మందపాడు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ఎన్నిక కావడంతో, ప్రతి సంవత్సరం ఆసుపత్రి అభివృద్ధికి రూ.3లక్షలు ప్రతి ఏటా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా తరుపున రావడ జరుగుతుందని మందపాడు గ్రామ సర్పంచ్ ఆవుల సంజీవరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు చేతుల మీదుగా అవార్డును సర్పంచ్ సంజీవరెడ్డి అందుకున్నారు. అవార్డు రావడంపై మందపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తపరిచారు.

27 నుంచి వానపాముల ఎరువు తయారీపై శిక్షణ

గుంటూరు రూరల్: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్, లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విలువ ఆధారిత వానపాముల ఎరువుల తయారీపై మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విలువ ఆధారిత వానపాముల ఎరువుల తయారీపై షెడ్యూల్ కులాలకు (ఎస్సీ) చెందిన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ మూడు రోజులు పాలు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆ సక్తిగల గుంటూరు, బాపట్ల, పల్నాడులకు చెందిన రైతులు తమ పేర్లను ఈ నెల 20వ తేదీలోపు 9490035258, 9989051559 నంబర్లకు ఫోన్ చేసి, నమోదు చేసుకోవాలన్నారు. గడువు అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

పట్నంబజారు: విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం అడపా బజారుకు చెందిన పల్లపు శివ (19) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు సంవత్సరాలుగా మానసికంగా ఇబ్బంది పడుతూ వైద్య చికిత్స పొందుతున్నాడు. ఈనెల 15న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ నెలాఖరులోపు పన్నుల్ని చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ పట్టణ ప్రజల్ని కోరారు.

పాస్టర్లపై దాడులు బాధాకరం



నెహ్రూనగర్: మత మార్పిడిల పేరుతో క్రైస్తవ మందిరాలు, పాస్టర్లపై దాడులు చేయడం బాధాకరమని అసోసియేషన్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెల రాజు పేర్కొన్నారు. నగరంలో ఏఐసీసీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. చర్చిలు, పాస్టర్లపై దాడుల్ని ఐక్యతతో అడ్డుకుంటామని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ స్టాన్లీబాబు, మార్క్, పాస్టర్లు దాసు, మణి, సుధీర్‌కుమార్, ఆనంద్, ప్రశాంత్ రాజ్, రవిచంద్ర పాల్గొన్నారు.

'అభయం' యాప్‌తో మహిళలకు రక్షణ

పట్నంబజారు: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అభయం యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీటీసీ షేక్ కరీమ్ సూచించారు. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉందని తెలిపారు. డౌన్‌లోడు చేసుకున్న తరువాత అందులో వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ట్రాకింగ్ పరికరాన్ని ఆటోలు, ఇతర ప్రజా రవాణా వాహనాల్లో అమరుస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు బయల్దేరిన సమయంలో వాహనంలో ఉన్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసినా, వాహనం నంబరు నమోదు చేసినా డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వస్తాయని, అనంతరం గమ్యస్థానాన్ని అందులో నమోదు చేయాలని సూచించారు. దీని తరువాత మూడు రూట్లు అందులో కనిపిస్తాయని, వాటిల్లో కాకుండా వేరే రూటులో డ్రైవర్ వెళుతున్న క్రమంలో అభయం పరికరంలో ఉన్న రెడ్ బటన్ నొక్కితే పోలీసు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళుతుందని వివరించారు. తక్షణమే వాహనం నిలిచిపోవడంతోపాటు, సమీపంలోని స్టేషన్‌కు ఆదేశాలు జారీ అవుతాయని తెలిపారు. జీపీఎస్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా వాహనం గుర్తించి మహిళల్ని రక్షించనున్నట్లు ఆయన వివరించారు.

పేదలకు ఉత్తమ వైద్య సేవలే లక్ష్యం



లబ్ధిదారుడికి నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి



నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఉత్తమ వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చినట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండలాలకు చెందిన ఎనిమిది మందికి రూ.3లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి ఇంటికే వైద్య సేవలు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు ఆమె అందజేశారు. బుడంపాడు గ్రామానికి చెందిన కుర్రా విజయలక్ష్మికి రూ.2 లక్షలు, గుంటూరుకు చెందిన తోరాటి బాల జ్యోతికి రూ.2లక్షలు, చిన్నపలకలూరు గ్రామానికి చెందిన ఎం.బెరనూతుకు లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములు కు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీన్ డాక్టర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం, ఎంపీపీ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: గాంధేయ వాదిగా.. ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం సాధించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం నగర శివారులోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా.. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు అకుంఠిత దీక్షను, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి శాస్త్రవేత్త, అధికారి రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఆనాడు గాంధీజీకి 79 మంది ప్రియ శిష్యులుంటే అందులో పొట్టి శ్రీరాములు ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

పెదనందిపాడులో....

పెదనందిపాడు: ఆంధ్రరాష్ట్ర ఆశయ సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని తహసీల్దారు సుభాని అన్నారు. గురువారం ఉదయం స్థానిక కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు సుభాని మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు ఆమరణ నిరహార దీక్ష చేసి అమరుడయ్యారని, ఆయన వల్లే మనకు రాష్ట్రం ఎర్పడిందని చెప్పారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే.. స్థానిక శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిణి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు, జి.రమేష్, అన్నలదాసు, విజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మత్యాగంతో అమరజీవి..

కాకుమాను: ఆంధ్రరాష్ట్ర అవతరణ ఆత్మత్యాగం చేసిన.. అమరజీవి అయిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలందరికీ చిరస్మరణీయులని కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింసా హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలు లెక్క చేయక నిరాహార దీక్ష చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ఎంపీడీఓ డి.శరత్ బాబు, ఈఓపీఆర్డీ నాగానంద్, డాక్టర్ అసదుల్లా, సుబ్బారావు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లాంఫాంలో పొట్టి శ్రీరాములు జయంతి..

గుంటూరు రూరల్: నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లాంఫాం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు మాట్లాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు గాంధేయవాది అని, ఆయన బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి చేసిన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితం నేడు మనం అనుభవిస్తున్న సుఖసంతోషాలని వివరించారు. ఈ కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కొండపాటూరు(కాకుమాను): విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సామార్థ్యాలను బట్టి.. వారికి విద్యను అందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నాణ్యమైన గుణాత్మక విద్య గురించి తల్లిదండ్రులకు వివరించి, విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శీలం అంకారావు పాల్గొన్నారు.

31న జీబీఏ ఎన్నికలు

గుంటూరు లీగల్: 2023-2024 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించిన గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్ని ఈ ఏడాది మార్చి 31న నిర్వహించాలని తీర్మానించినట్లు జీబీఏ గురువారం ప్రకటించింది. సీనియర్ న్యాయవాది ఎస్.రామ్‌మోహన్‌రావును ఎన్నికల అధికారిగా ఏకగ్రీవంగా వ్యవహరిస్తారు. దీనికి గానూ ఆయనకు గౌరవ వేతనంగా యాభై వేల రూపాయలు చెల్లించనుంది. అభ్యర్థుల నామినేషన్ల ద్వారా వచ్చే డబ్బును ఎన్నికల నిర్వహణకు ఉపయోగించుకోవాలని జీబీఏ సూచించింది.